


కేరళలో ప్రాణాంతక నిపా వైరస్ కలకలం రేపుతోంది. నిపా వైరస్ బారిన పడి మృతి చెందుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ఈ వైరస్ బారిన పడి మృత్యువాత పడ్డారు. కేరళ రాష్ట్ర ఆరోగ్య శాఖ నిపా వైరస్ కలకలంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు సమాచారం అందించింది. గోరఖ్‌పూర్‌లో ఆక్సీజన్ సిలెండర్ల కొరతతో 30 మంది చిన్నారులు మరణించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడు డాక్టర్ కఫీల్‌ఖాన్ నిపా వైరస్ కట్టడికి కేరళ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని ఆసక్తి కనబరిచారు. ఆయన్ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆహ్వానించారు. నిపా వైరస్ సోకిన వారికి వైద్య చికిత్సలు అందించిన నర్సు లినీ పుతుస్సేరీ(28) కూడా మృతి చెందారు.

రాష్ట్ర వ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించారు. రెండు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఇన్ఫెక్షన్ సోకినవారు పరిసరాల్లో ఉన్నప్పుడు మాత్రమే ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందని వివరించింది.

- నిపా వైరస్‌ను తొలిసారిగా 1998లో గుర్తించారు. మలేసియాలోని కాంపుంగ్ సుంగై నిపా అనే ప్రాంతంలో ఈ వైరస్‌ను మొదట గుర్తించటంతో దానికి ఆ పేరు పెట్టారు. నిఫాలో ఇది పందుల ద్వారా వ్యాపించింది.
- ఈ సూక్ష్మక్రిమిని నిరోధించే వ్యాక్సిన్ లేదు. పండ్లు తినే గబ్బిలాలు, పందుల నుంచి ఈ వైరస్ సంక్రమిస్తోంది. వైరస్ సోకిన గబ్బిలాలు, పందులకి దగ్గరగా మసలడం వల్ల, నిపా వ్యాధి ఉన్న పక్షులు, జంతువులు కొరికి వదిలేసిన పండ్లను తినడం, వైరస్ బారిన పడిన వ్యక్తులను నేరుగా తాకడం వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది.
- ఈ వైరస్ సోకినవారిలో సగటున 70 శాతం మంది వరకు మరణించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. నిపా వైరస్ భారతదేశంలో తొలిసారిగా 2001 సంవత్సరంలో పశ్చిమబెంగాల్‌లోని సిలిగుడిలో వెలుగులోకి వచ్చింది. అప్పట్లో 66 కేసులు నమోదైతే 45 మంది (68 శాతం) మరణించారు. ఆ తర్వాత 2007 సంవత్సరం పశ్చిమ బెంగాల్‌లోనే నాడియాలోనూ నిపా వైరస్ కనిపించింది. కేరళలో ఈ వైరస్‌ను గుర్తించడం ఇదే తొలిసారి.
- గబ్బిలాలు, పందుల ద్వారా ఎక్కువగా నిపా వైరస్ సోకుతుంది. గబ్బిలాలు తీసుకున్న ఆహారం ద్వారా ఇది సోకుతుంది. ముఖ్యంగా పండ్లు, కూరగాయల ద్వారా ఇది సోకే ప్రమాదం ఎక్కువ. పందులు, పిల్లి, కోతులు తదితరాల ద్వారా కూడా ఇది మనుషులకు సోకుతుంది.
- **వ్యాధి లక్షణాలు :** శ్వాస తీసుకోలేకపోవడం, జ్వరం, తలనొప్పి.తలనొప్పి తీవ్రత ఎక్కువగా ఉండి క్రమంగా పదిహేను రోజుల పాటు జ్వరం వెంటాడిన పక్షంలో నిపా బారిన పడ్డట్టే.
- **సలహాలు :** పెంపుడు జంతువులకు దూరంగా ఉండటం, పండ్లు, కూరగాయలను పరిశుభ్ర పరిచిన తర్వాతే తీసుకోవడం, చేతులను ప్రతిసారీ సబ్బుతో కడుక్కోవడం,మామిడిపండ్లు, జాక్ ఫ్రూట్స్, రోజ్ ఆపిల్స్‌లను గబ్బిలాలు ఆహారంగా ఎక్కువ తీసుకుంటాయి. వీటిని వినియోగించేప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి.

### 'నిఫా'పై ఆస్ట్రేలియా సహాయం కోరిన భారత్

కేరళలో నిఫా వైరస్ కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో భారత్ ఆస్ట్రేలియా సహాయాన్ని కోరింది. ఈ వైరస్‌ను నిరోధించగల సామర్థ్యమున్నట్లు భావిస్తున్న యాంటీబాడీని తమకు అందజేయాల్సిందిగా అక్కడి క్వీన్స్‌లాండ్ ప్రభుత్వానికి భారత వైద్య పరిశోధన మండలి లేఖ రాసింది. ఆస్ట్రేలియా పరిశోధకులు అభివృద్ధి చేసిన మోనోక్లోనల్ యాంటీబాడీ పరీక్ష నాళికల్లో–కృత్రిమ పరిస్థితుల్లో నిఫా వైరస్‌పై ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు ఐసీఎంఆర్ ప్రధాన సంచాలకులు డాక్టర్ బలరాం భార్గవ తెలిపారు. ఇప్పటివరకు దాన్ని మానవులపై మాత్రం పరీక్షించలేదని వెల్లడించారు. మనుషుల్లో 'నిఫా'ను తటస్థీకరించే సామర్థ్యం దానికి ఉందో లేదో పరీక్షించి తెలుసుకునేందుకుగాను సదరు యాంటీబాడీని అందజేయాల్సిందిగా క్వీన్స్‌లాండ్ ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. తమ అభ్యర్థనను మన్నించేందుకు ఆస్ట్రేలియా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 'నిఫా'ను నిలువరించే టీకా తయారీలో మాత్రం ఈ యాంటీబాడీ ఉపయోగపడబోదని స్పష్టం చేశారు.